సాక్షి
జగిత్యాల
బుధవారం । 19 । జూలై । 2023



బోనాల వేడుకలు

జగిత్యాల: దుబాయ్‌లోని తెలుగు మహిళలు ఆషాఢ మాసం బోనాల పండుగను అత్యంత వైభవంగా జరుపుకున్నారు.



సంతకాల సేకరణ

జగిత్యాల: విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తపస్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
26.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పరిహారం చెల్లించాలి

జగిత్యాల: జిల్లాలోని వివిధ కారణాలతో బాధితులైన ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం తక్షణమే రిలీఫ్‌ఫండ్ చెల్లించాలని షెడ్యూల్డ్ ట్రైబ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవీదాస్‌నాయక్ కోరారు. మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో దాదాపుగా 263 మంది బాధితులకు రూ.1,92,97,500 అందాల్సి ఉందని తెలిపారు. రిహాబిలిటేషన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ యాక్ట్ ప్రకారం పరిహారం చెల్లించాలని ఆయన కోరారు.

పారిశుధ్యంపై దృష్టి



డ్రెయినేజీ పరిశీలిస్తున్న రామానుజాచారి

జగిత్యాలరూరల్: గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణపై దృష్టి సారించాలని జెడ్పీ సీఈవో రామానుజాచారి సూచించారు. తిప్పన్నపేట గ్రామంలో చేపట్టిన పారిశుధ్య పనులను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోజూ పారిశుధ్య పనులను నిర్వహించాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. హరితహారం ద్వారా విరివిగా మొక్కలు నాటాలని తెలిపారు. వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శైలజ, ఎంపీవో మహ్మద్ సలీం, పంచాయతీ కార్యదర్శి మ హేశ్, వ్యవసాయాధికారి వినీల పాల్గొన్నారు.

ఐక్య పోరాటాల ఫలితమే..



మాట్లాడుతున్న సుతారి రాములు

కోరుట్ల: మధ్యాహ్న భోజన కార్మికుల ఐక్య పోరాటాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం వేతనాల పెంపుపై ప్రకటన చేసిందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు అన్నారు. స్థానిక సి.ప్రభాకర్ భవన్‌లో మంగళవారం కార్మికులతో సమావేశం నిర్వహించారు. రాములు మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రకటనను స్వాగతిస్తూ సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నామన్నారు. వంట సామగ్రి, వంటగ్యాస్ సిలిండర్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని, ప్రతీనెల 5వ తేదీలోగా మెస్ చార్జీలు విడుదల చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు కొంక భాగ్య, పద్మ, పరమేశ్వరి, హారిక, సునంద, పద్మ, అబుదాబేగం పాల్గొన్నారు.


వైద్యుల పనితీరుపై ఆరా

రాయికల్(జగిత్యాల): స్థానిక, వైద్య, విధాన పరిషత్ ఆస్పత్రి వైద్యుల పనితీరుపై కలెక్టర్ యాస్మిన్ బాషా ఆరా తీశారు. 'మారని వైద్యుల తీరు' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. సమయపాలన పాటించని వైద్యుల వివరాలతోపాటు, సూపరింటెండెంట్ రవిని వివరణ ఇవ్వాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం విధులకు హాజరుకాని డాక్టర్ల జాబితా తనకు పంపించాలని కలెక్టర్ సూచించారు.

గోదావరి తీరంలో అప్రమత్తం

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలం గోదావరి తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు మంగళవారం సూచించారు. నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టులోకి భారీవరద వచ్చి చేరుతోందని, దీంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని వదలుతామని ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాథోడ్ విఠల్ తెలిపారు. దీంతో గోదావరి తీరంలోని మంగేళ, రంగసాగర్, కమ్మునూర్, చిత్రవేణిగూడెం, రేకులపల్లి, చిన్నకొల్వాయి గ్రామాల ప్రజలు నదిలోకి వెళ్లవద్దని సూచించారు. ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తే గోదావరిలో ప్రవాహం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

పరిశుభ్రత పాటించాలి



హోటల్‌లో తనిఖీ చేస్తున్న అనూష

మల్లాపూర్(కోరుట్ల): అపరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాలు తయారు చేసినా, కల్తీ చేసినా యజమానులపై కేసులు నమోదు చేస్తామని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని హోటళ్లు, కిరాణాలు, బేకరీలను అధికారులతో కలిసి తనిఖీలు చేపట్టారు. ఆహారం తయారీ, పరిశుభ్రత, తయారీకి వాడే పదార్థాలు, వాటి నాణ్యత తదితర అంశాలను పరిశీలించారు.

అందమైన యువతులు.. స్టేటస్‌లో ఫొటోలు



- జగిత్యాల శివారు అంతర్గాం రోడ్డులోని ఓ ఇంటిపై పోలీసులు సోమవారం మధ్యాహ్నం దాడి చేశారు. వ్యభిచారం నిర్వహిస్తున్న మహిళ, నిర్వాహకులతోపాటు ముగ్గురు యువతులను పట్టుకున్నారు. యువతులను సఖీ కేంద్రానికి తరలించారు. నిర్వాహకులు, విటుడిని రిమాండ్‌కు తరలించారు.
- జగిత్యాల శివారు తిమ్మాపూర్ రోడ్డులో కొత్త ఇంటిని అద్దెకు తీసుకున్న ఓ మహిళ.. కరీంనగర్, మంచిర్యాల ప్రాంతాలకు చెందిన ఇద్దరు యువతులను తీసుకొచ్చి వ్యభిచారం నిర్వహిస్తోంది. సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. నిందితులను పట్టుకుని కేసు నమోదు చేశారు. ఐదు నెలల క్రితం ఈ ఘటన చోటుచేసుకుంది.
- నెల క్రితం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రులు ఉండేచోట ఓ మహిళ, ఇద్దరు యువతులు వ్యభిచారం చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారు.
- మల్యాల మండలం నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీలోని ఓ ఆలయం సమీపంలోగల ఇంట్లో కొద్దిరోజులుగా వ్యభిచారం జరుగుతోంది. స్థానికుల సమాచారంతో పోలీసులు దాడి చేయగా.. అప్పటికే నిందితులు తప్పించుకుని పారిపోయారు.

నిఘా పటిష్టం చేశాం



జిల్లాలో వ్యభిచారాన్ని అరికట్టేందుకు నిఘా పటిష్టం చేశాం. దందా ప్రాంతాల్లో పోలీసులు మఫ్టీలో తిరుగుతున్నారు. వ్యభిచారం నిర్వహిస్తున్న ఇళ్లలో దాడులు చేస్తున్నారు. ఇప్పటివరకు నిర్వాహకులను అరెస్టు చేశాం. ఇంకా చాలామంది ఉన్నట్లు మాకు సమాచారం ఉంది. వారిని కూడా పట్టుకుంటాం.
– భాస్కర్, ఎస్పీ

- వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు
- యువకులకు నచ్చితే రేటు నిర్ణయం
- పట్టణ శివారు, మారుమూల గ్రామాల్లో అడ్డాలు
- ప్రతినెలా రూ.20లక్షల వరకు టర్నోవర్
- జిల్లాలో జోరుగా హైటెక్ వ్యభిచారం
- ప్రత్యేక దృష్టి సారించిన జిల్లా పోలీసులు

జగిత్యాలక్రైం: జిల్లాలో హైటెక్ వ్యభిచారం జోరుగా సాగుతోంది. అందమైన యువతులు, మహిళల ఫొటోలను వాట్సాప్‌లో స్టేటస్‌గా పెడుతున్న దళారులు.. యువకులను ఆకర్షిస్తున్నారు. కేవలం తమకు పరిచయం ఉన్నవారితోనే వాట్సాప్ గ్రూపులు తయారు చేస్తూ వ్యభిచారం దందా విస్తరిస్తున్నారు. పట్టణ శివారు ప్రాంతాలు, మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్లను అడ్డాలుగా చేసుకుంటున్నారు. జిల్లా కేంద్రంతోపాటు, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి, మల్యాల, కొండగట్టు తదితర ప్రాంతాల్లో దందా జోరుగా సాగుతోందనే సమాచారం అందడంతో పోలీసులు రంగంలోకి దిగారు. గత జనవరి నుంచి ఇప్పటివరకు ఏడుగురు నిర్వాహకులపై మూడు కేసులు నమోదు చేశారు. అయినా, వ్యభిచారం ఆగడంలేదు.

ప్రముఖులకూ సరఫరా..

- దళారులు అందమైన యువతులను ఎరగా చూపుతూ యువకులను ఆకర్షిస్తున్నారు. కొందరు ప్రముఖులకు కూడా సరఫరా చేస్తున్నారు. ఇలాంటివారు కోరుకుంటే ఫామ్‌హౌస్‌లు, గెస్ట్‌హౌస్‌లు, అత్యాధునిక వసతులు కలిగిన భవనాలు ఎంచుకుంటున్నారు. ఖరీదైన వాహనాల్లో యువతలను తరలిస్తున్నారు. యువతులు అడిగినంత సొమ్ము చెల్లిస్తూ వ్యాపారం విస్తరిస్తున్నారు.

నెల టర్నోవర్ రూ.20లక్షల పైనే..

జిల్లాలో జరిగే హైటెక్ వ్యభిచారంలో సుమారు 150మంది దళారులు ప్రముఖ పాత్ర పోషిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వీరు నిజామాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్, వైజాగ్, వరంగల్, హైదరాబాద్, సంగారెడ్డి తదితర ప్రాంతాల్లోంచి యువతులను రప్పిస్తున్నారు. తమతో టచ్‌లో ఉండే యువకులకు వీరి ఫొటోలను వాట్సాప్ స్టేటస్‌లో పెడుతూ, వాట్సాప్‌లో పంపిస్తూ ఆకర్షిస్తున్నారు. యువకులకు నచ్చితే.. ఆ ఫొటోలోని యువతికి రేటు నిర్ణయిస్తున్నారు. ఇళ్లలో అయితే రూ.1,500 నుంచి రూ.2,000 వరకు, బయటకు తీసుకెళ్తే రూ.5వేల నుంచి రూ.6వేల వరకు రేట్ కుదుర్చుకుంటున్నారు. ఈ సొమ్మును ఫోన్‌పే, గూగుల్‌పే తదితర డిజిటల్ పద్ధతుల్లో చెల్లింపులు చేసుకుంటున్నారు. మరోవైపు.. జిల్లాలో సుమారు వంద మంది వరకు వ్యభిచార నిర్వాహకులు ఉన్నట్లు తెలిసింది. వీరితోనే దళారులు దందా సాగిస్తున్నారు. మొత్తంగా జిల్లావ్యాప్తంగా ప్రతినెలా సుమారు రూ.20లక్షల వరకు టర్నోవర్ సాగుతోందని అధికారులు అంచనా వేస్తున్నారు.

అర్హులందరికీ ఓటుహక్కు



హాజరైన అధికారులు



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

- అధికారులే బాధ్యత తీసుకోవాలి
- కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: జిల్లాలో అర్హులైన వారందరికీ ఓటుహక్కు కల్పించాలని, ఇందుకు అధికారులే బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పొరపాట్లు లేనిఓటరు జాబితా తయారు చేయాలన్నారు. 2023 అక్టోబరు 1 నాటికి 18ఏళ్లు నిండిన వారిపేర్ల నమోదుకు ఇంటింటా పర్యటించాలని చెప్పారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుపై అవసరమైన సమాచారం సేకరించి నిర్ణీత ఫారాల ద్వారా ప్రక్రియ పూర్తిచేయాలని అన్నారు. ట్రాన్స్‌జెండర్లు, సెక్స్ వర్కర్ల సమాచారాన్ని సేకరించి ఓటుహక్కు కల్పించాల్సిన బాధ్యత బూత్‌స్థాయి అధికారులపై ఉందని పేర్కొన్నారు. దివ్యాంగ ఓటర్ల పేర్లు నమోదు చేసి ఫ్లాగ్ చేయాలన్నారు. జిల్లాలో 18, 19ఏళ్ల వయసుగల యువత పేర్లు ఓటరు జాబితాలో నమోదు చేయడంలో వ్యత్యాసం ఉందని, దీనిని సవరించాలని చెప్పారు. అనంతరం మాస్టర్ ట్రైనర్లు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లత తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా విధులు నిర్వర్తించాలి

నోడల్ అధికారులు ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. నోడల్ అధికారులతో మంగళవారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్, ట్రైనీ, మెటీరియల్ మేనేజ్‌మెంట్, రవాణా, కంప్యూటరీకరణ, సైబర్ సెక్యూరిటీ, ఐటీ స్వీప్, శాంతిభద్రతల సెక్యూరిటీ, ఈవీఎం మేనేజ్‌మెంట్, ఎంసీసీ ఖర్చుల మానిటరింగ్, బ్యాలెట్, పోస్టల్ బ్యాలెట్, మీడియా కమ్యూనికేషన్, ఎలక్టోరల్ ఫిర్యాదుల కోసం పరిశీలకులుగా నోడల్ అధికారులను నియమించామని తెలిపారు. వీరికి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేలా కృషి చేయాని అన్నారు. అదనపు కలెక్టర్ లత పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు దరఖాస్తు చేసుకోండి

పట్టణంలోని ఇళ్లు లేనిపేదలు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల కోసం మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ యాస్మిన్‌బాషా సూచించారు. ఈనెల 19 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. రేషన్‌కార్డు, ఆధార్, ఆదాయం, కులం సర్టిఫికెట్లతోపాటు, జగిత్యాలలో నివాసం ఉండేవారే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి

- ఎస్పీ భాస్కర్



హాజరైన పోలీసు అధికారులు

జగిత్యాలక్రైం: మిస్సింగ్ కేసులతోపాటు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ భాస్కర్ ఆదేశించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జగిత్యాల రూరల్, ధర్మపురి సర్కిల్ పరిధిలో పెండింగ్ కేసులపై మంగళవారం సమీక్షించారు. ఇప్పటివరకు నమోదైన కేసులలో నాన్ గ్రేవ్, గ్రేవ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తప్పిపోయిన, కనిపించకుండా పోయిన వ్యక్తి ఫొటోను అన్ని పోలిస్టేషన్లకు పంపించాలని చెప్పారు. ప్రధానంగా మహిళలు, చిన్నపిల్లలు కేసులను ప్రథమ ప్రాధాన్యంగా తీసుకుని ట్రేస్ చేయాలని సూచించారు. గుర్తుతెలియని మృతదేహాల విషయంలో కేసు నమోదు చేయగానే ఫొటోలు సీసీటీఎన్‌ఎస్‌లో అప్‌లోడ్ చేయాలని అన్నారు. తద్వారా కేసును త్వరగా ఛేదించే వీలుందని చెప్పారు. దోపిడీలు, దొంగతనాలు, ఇతర నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. దొంగతనాల నియంత్రణకు ప్రతీ సర్కిల్‌లో స్పెషల్‌టీంను నియమించాలని పేర్కొన్నారు. నేర నియంత్రణలో కీలకపాత్ర పోషించే సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీలు వెంకటస్వామి, శ్రీనివాస్, సీఐలు రమణమూర్తి, ఆరిఫ్ అలీఖాన్, ఎస్సైలు, డీసీఆర్బీ, ఐటీ కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమిస్తేనే సమస్యలకు పరిష్కారం

- ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ
- వడ్డెర కులస్తులకు లేబర్ కార్డులు పంపిణీ



లేబర్‌కార్డులు అందిస్తున్న నాయకులు తుల ఉమ, సత్యనారాయణ తదితరులు

కథలాపూర్: ఉద్యమిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ అన్నారు. మంగళవారం కథలాపూర్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో వడ్డెర యువజన సంఘం జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డెర కులస్తులకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన లేబర్ కార్డులను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. పేదలకు అండగా ఉండే వ్యక్తులను ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవాలన్నారు. తెలంగాణ ఏర్పడితే ఈ ప్రాంతవాసులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఉద్యమాలు చేశామని, సాధించిన రాష్ట్రాన్ని కల్వకుంట్ల కుటుంబానికి అప్పగించి, మోసపోయామని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో దోపిడీ ఎక్కువైందని, దానికి వ్యతిరేకంగా కొట్లాడాలనే తాను బయటకు వచ్చానన్నారు. గుట్టల్లో రాయితో వడ్డెర కులస్తులు ఉపాధి పొందేలా చట్టం తేవాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ మాట్లాడుతూ.. కాంక్రీట్, బేటీరాయి తయారు చేసే పరిశ్రమల్లో వడ్డెరలను భాగస్వాములను చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుట్టల్లో ఉన్న రాయిని కొట్టే హక్కు వడ్డెర కులస్తులకే ఉండాలన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గడీల గంగప్రసాద్, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు బోదాస్ నర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి జలంధర్, మండల అధ్యక్షుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్(జగిత్యాల): రైతు రుణమాఫీపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం బీర్‌పూర్ మండలంలో పర్యటించిన అనంతరం ఆయన సారంగాపూర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో పేదరైతులకు పంపిణీ చేసిన పోడుపట్టాలపై కేడీసీసీబీ, పలు బ్యాంకులు పంట రుణాలు మంజూరు చేయడం లేదని, ప్రభుత్వం స్పందించాలని సూచించారు. రోళ్లవాగు ప్రాజెక్టు నిర్మాణం పూర్తికావస్తోందన్నారు. అయితే, దిగువకు నీరు విడుదల చేయడానికి మూడు తూములు ఏర్పాటు చేశారని, వీటికి అటవీశాఖ అనుమతులు లేవని గేట్లు బిగించడం లేదని తెలిపారు. దీంతో ప్రాజెక్టులోకి వచ్చిన నీరు బయటకు వృథాగా వెళ్తోందని అన్నారు. కాళేశ్వరం నుంచి రోజూ 2 టీఎంసీలు ఎత్తి పోసేలా డిజైన్ చేశామని చెబుతున్నా.. రోజూ ఒక టీఎంసీ మాత్రమే ఎత్తిపోస్తున్నారని చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణంలో ఏమైనా లోపం ఉందా? అని అనుమానం వ్యక్తం చేశారు. ఎంపీపీ మసర్తి రమేశ్, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, కాంగ్రెస్ నాయకులు గుడిసె జితేందర్, చెర్పూరి సుభాష్, కోండ్ర రాంచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

ఉర్దూ బడిలో సిబ్బందిని నియమించండి

జగిత్యాల: పొలాసలోని ఉర్దూ పాఠశాలలో బోధన సిబ్బందిని నియమించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. ఈమేరకు కలెక్టర్ యాస్మిన్ బాషాకు లేఖ రాశారు. ఉపాధ్యాయుల నియామకంలో జాప్యమవుతోందని, విద్యార్థులు నష్టపోకుండా తాత్కాలిక పద్ధతిన బోధన సిబ్బందిని నియమించాలని కోరారు. బడిలో సుమారు 150 మంది విద్యార్థులు ఉన్నారని, వారు చదువులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

ఆధునిక వసతులు.. ఉత్తమ విద్యా బోధన

- అందుబాటులోకి వచ్చిన మహాత్మా జ్యోతిబా పూలే కళాశాల
- ప్రారంభమైన ప్రవేశాలు
- 26 నుంచి బోధన తరగతులు

అందుబాటులో ఉన్న గ్రూపులు ఇవే..	
బీఏ	ఈపీహెచ్
బీకాం	సీఏ
బీఎస్సీ	ఎంపీసీ, ఎంపీసీఎస్,
	ఎంఎస్‌డీఎస్,
	ఎంఎస్‌ఈఎస్, బీజెడ్సీ
ఒక్కో గ్రూపులో	40మందికి ప్రవేశాలు



మహాత్మాజ్యోతిబా పూలె ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ధర్మపురి: స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే డిగ్రీ కళాశాల ఆధునిక హంగులు సంతరించుకుంది. ఇప్పటికే ఇందులో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 26న బోధన తరగతులు ప్రారంభించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉచిత భోజనం, వసతి కల్పించడంతోపాటు రెసిడెన్షియల్ పద్ధతిన ఉచితంగా ఉత్తమ విద్యాబోధన చేస్తామని విస్తృత ప్రచారం చేస్తున్నారు.

ప్రైవేట్ భవనంలో..

- స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని ఓ ప్రైవేట్ భవనంలో మహాత్మాజ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశారు.
- సంక్షేమ సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్ మార్చిలో కళాశాల ప్రారంభించారు.
- ఆ వెంటనే వేసవి సెలవుల వచ్చాయి. ఈ విద్యా సంవత్సరం ఆరంభంలో ప్రవేశాలు కల్పించారు.
- ఈనెల 26 నుంచి బోధనా తరగతులు ప్రారంభిస్తారు.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి జిల్లాలలోని పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటతోపాటు ధర్మపురి పట్టణంలోనూ మహాత్మా జ్యోతిబాపూలె డిగ్రీ కళాశాలల్లో ఏకకాలంలో బోధన తరగతులు ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ధర్మపురి, ఎల్లారెడ్డిపేటలో పురుషులు, పెద్దపల్లిలో మహిళలకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. ధర్మపురి కాలేజీలో 8 గదుల్లో 16 మంది అధ్యాపకులతో బోధన చేస్తారు. పీడీ, లైబ్రేరియన్‌ను నియమించారు. క్రీడలు, సాంస్కృతిక, నైపుణ్య రంగాల్లో అవగాహన కల్పించేందుకు ప్రణాళిక రూపొందించారు.

అనుభవజ్ఞులతో బోధన



రాష్ట్ర, జాతీయస్థాయి అర్హత పరీక్షల్లో ప్రతిభ చూపిన, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో మహాత్మా జ్యోతిబాపూలే డిగ్రీ కాలేజీలో విద్యాబోధన చేస్తాం. ఇందుకోసం ఏర్పాట్లు చేస్తున్నాం. 'దోస్త్' ఆధారంగా ప్రవేశాలు ఉంటున్నాయి. ఈనెల 26న విద్యాబోధన ప్రారంభిస్తాం. నాణ్యమైన విద్య, ఉచితంగా వసతి, పుస్తకాలు అందిస్తాం. పరీక్ష ఫీజు మినహాయింపు ఉంది. అర్హులు సద్వినియోగం చేసుకోవాలి.
– రాధాకిషన్, ప్రిన్సిపాల్

సద్వినియోగం చేసుకోండి



రెసిడెన్షియల్ పద్ధతిన బీసీలకు డిగ్రీ విద్య అందుబాటులోకి రాక పేదలు, ముఖ్యంగా గ్రామీణ బాలికలు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ధర్మపురిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేయించాం. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
– కొప్పుల ఈశ్వర్, మంత్రి

క్లుప్తంగా

అడిషనల్ కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే



అడిషనల్ కలెక్టర్ దివాకర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా నియమితులైన దివాకర్‌ను జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులపై చర్చించారు.

కేసు నమోదు

సిరిసిల్లక్రైం: ఆర్టీసీ బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్న జీడిపల్లి రత్నాకర్‌రెడ్డి సెల్‌ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు సిరిసిల్ల సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. కామారెడ్డికి చెందిన రత్నాకర్‌రెడ్డి వేములవాడ బస్సు డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 16న కామారెడ్డి వెళ్లడానికి సిరిసిల్ల పాత బస్టాండ్‌లో బస్సు కోసం చూస్తుండగా దొంగలు అతడి ఫోన్ దొంగలించారు. అంతేకాకుండా అతడి ఫోన్‌కు లింకు ఉన్న బ్యాంకు ఖాతాల నుంచి రూ.1.94 లక్షలు నిందితుడు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు ఈ నెల 17న రాత్రి ఫిర్యాదు చేయడంతో మంగళవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

ఆయన నేత్రాలు సజీవం

ఓదెల(పెద్దపల్లి): గ్రామానికి చెందిన గొర్ల రాజయ్య(52) సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందాడు. కుటుంబసభ్యులు ఆయన నేత్రాలను దానం చేయాలని నిర్ణయించుకున్నారు. మంగళవారం సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ భీష్మాచారి ఆధ్వర్యంలో వాసన్ ఐ బ్యాంకు టెక్నీషియన్ కిరణ్ సహకారంతో నేత్రాలను సేకరించి, ఐ బ్యాంకుకు తరలించారు. మృతుడి భార్య రాజక్క, కుమారులు నాగరాజు, మహేందర్‌లను అభినందించారు.

ఈటల అనుచరులపై ఫిర్యాదు

జమ్మికుంట(హుజూరాబాద్): పట్టణంలోని 629,887 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అనుచరులు కబ్జా చేశారని, జీవో 59,58ను అడ్డుపెట్టుకుని, సుమారు 5 ఎకరాల భూమిని ఆక్రమించుకున్నారని బీఆర్ఎస్ నాయకులు తుమ్మేటి సమ్మిరెడ్డి, టంగుటూరి రాజ్‌కుమార్, అవుల తిరుపతి మంగళవారం హైదరాబాద్‌ని లోకయుక్తలో ఫిర్యాదు చేశారు. ఈటల బీఆర్ఎస్‌లో కొనసాగిన సమయంలో అసైన్డ్‌భూముల చైర్మన్‌గా ఉండడంతో అతని అనుచరులు కోట్ల విలువైన భూమి కబ్జా చేశారని పేర్కొన్నారు. 629 సర్వే నంబర్‌లో 6వేల గజాలస్థలంలో ఎలాంటి నిర్మాణం లేకుండా ఇంటి నంబరు పొంది, రూ.3కోట్ల విలువైన భూమిని స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారని తెలిపారు.

రేషన్ డీలర్లకు అందని కమీషన్

కథలాపూర్(వేములవాడ): జిల్లాలోని రేషన్ డీలర్లకు మూడు నెలలుగా కమీషన్ అందడం లేదు. కార్డుదారులకు ప్రతినెలా పక్కాగా బియ్యం పంపిణీ చేస్తున్నా.. కమీషన్ విడుదల కాకపోవడంపై డీలర్లు నిరుత్సాహపడుతున్నారు.

జిల్లాలో 3.08 లక్షల రేషన్‌కార్డులు

- జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు, 20 మండలాల్లో 3.08 లక్షల రేషన్‌కార్డులు, 519 దుకాణాలు ఉన్నాయి.
- ఇందులో ఆహారభద్రత 2,94,294, అంత్యోదయ 14,316, అన్నపూర్ణ కార్డులు 146 ఉన్నాయి.
- మొత్తం లబ్ధిదారులు 8,88,679 మంది ఉన్నారు.
- ఇందులో ఒక్కొక్కరికి ఈనెలలో 6 కిలోల చొప్పున బియ్యం రేషన్ దుకాణాలకు చేరాయి.
- వీటిని ఉచితంగానే పంపిణీ చేస్తున్నన్నారు.

ఏప్రిల్ నుంచి రావాలి..

రేషన్ డీలర్‌కు క్వింటాలుపై రూ.70 చొప్పున ప్రభుత్వం కమీషన్ రూపంలో చెల్లిస్తూ వస్తోంది. కేంద్రప్రభుత్వం రూ.20 పెంచినా.. రాష్ట్రప్రభుత్వం రూ.10 వరకు కలిపి ఇస్తోంది. ఈ ఏడాది మార్చి వరకు కమీషన్ చెల్లించింది. ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు కమీషన్ రావాల్సి ఉందని డీలర్లు చెబుతున్నారు.



సిరికొండలో బియ్యం పంపిణీ చేస్తున్న రేషన్ డీలర్ (ఫైల్)

ఆలస్యం దారుణం



నెలరోజుల కష్టపడితే ప్రభుత్వం ఇచ్చేది అరకొర కమీషనే. వేతనాలు చెల్లించాలని ప్రభుత్వానికి విన్నవించాం. అయినా, పట్టించుకోవడంలేదు. ప్రస్తుత కమీషన్ చాలా తక్కువ. అదికూడా ప్రతినెలా ఇవ్వడం లేదు.

– ముంజ జలేందర్, రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధి, కథలాపూర్

నిధులు రాగానే చెల్లిస్తాం



రేషన్ డీలర్లకు ఏప్రిల్ నెల కమీషన్ రావాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కా గానే డీలర్లకు చెల్లించే ఏర్పాట్లు చేస్తాం. అప్పటివరకు మేమేమీ చేయలేం. కమీషన్ బకాయిల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– చందన్‌కుమార్, జిల్లా పౌర సరాఫరాల అధికారి

హత్య కేసులో తల్లీకూతురు అరెస్టు

ధర్మపురి: మండలంలోని నేరెల్ల గ్రామానికి చెందిన దాసండ్ల మాణిక్యం(40 హత్య కేసులో అతని భార్య, అత్తను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రమణమూర్తి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం .. మాణిక్యం నిత్యం మద్యం సేవిస్తూ తన భార్యను వేధించేవాడు. దీంతో ఈ నెల 16న రాత్రి నిద్రిస్తున్న సమయంలో మాణిక్యంపై అతని భార్య జమున, అత్త నమిలికొండ శాంతవ్వ కర్రలతో విచక్షణారహితంగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి భూమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులైన తల్లీకూతురును మంగళవారం అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు దత్తాత్రి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

ధర్మపురిలో కారును ఢీకొన్న జేసీబీ

- ఒకరికి తీవ్ర, మరొకరికి స్వల్ప గాయాలు

ధర్మపురి: కారును జేసీబీ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బుర్ర వెంకటేశ్, మరొకరు మంగళవారం ధర్మపురి నుంచి లక్సెటిపేటకు కారులో వెళ్తున్నారు. ధర్మపురిలోని అంబేడ్కర్ విగ్రహం టర్నింగ్ వద్ద ఎదురుగా వస్తున్న జేసీబీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. వెంకటేశ్ తీవ్రంగా, మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. వెంకటేశ్‌ను 108 వాహనంలో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్సై దత్తాత్రి పరిశీలించి, జేసీబీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.



తీవ్రంగా గాయపడిన వెంకటేశ్



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

ట్రాక్టర్ బోల్తా.. తప్పిన ప్రమాదం

వీర్నపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రానికి చెందిన రైతు చొప్పరి మోహన్ తన వ్యవసాయ పొలంలో ట్రాక్టర్‌ను ఒడ్డు దించే క్రమంలో బోల్తా పడింది. గత రెండు రోజులుగా వర్షం పడడంతో బురదమయం అయ్యి ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, ట్రాక్టర్ డ్యామేజ్ అయినట్లు మోహన్ తెలిపారు.



పొలంలో బోల్తాపడిన ట్రాక్టర్

కారు-బస్సు ఎదురెదురుగా ఢీ

- ఒకరికి గాయాలు

మల్యాల: ఆర్టీసీ బస్సు, కారు ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం వేములవాడ నుంచి జగిత్యాల వెళ్తున్న ఆర్టీసీ బస్సు, జగిత్యాల నుంచి కరీంనగర్ వైపు వస్తున్న ఓ కారు మల్యాల మండలంలోని బల్వంతాపూర్ శివారులో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాల ముందు భాగం దెబ్బతినగా బస్సులో ఉన్న ఓ ప్రయాణికుడు గాయపడ్డాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బస్సు డ్రైవర్ రాజు తెలిపాడు.

పరామర్శ



నివాళి అర్పిస్తున్న తుల ఉమ, భోగ శ్రావణి

జగిత్యాల: బీజేపీ నాయకుడు ఎల్.శేఖర్ తండ్రి ఎల్బీరామ్ ఇటీవల మరణించగా ఆయన చిత్రపటానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి మంగళవారం నివాళి అర్పించారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. వారి వెంట నాయకులు వీరబత్తిని అనిల్, అశోక్, గంగారాం, మల్లేశ్ ఉన్నారు.

రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం

- చెల్లాచెదురైన శరీర భాగాలు
- ఆత్మహత్యా? లేదా ప్రమాదమా?
- ముత్యంపేట శివారులో ఘటన

మల్యాల: మండలంలోని ముత్యంపేట శివారు రైల్వే ట్రాక్‌పై మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. ప్రమాదవశాత్తు జరిగిందా? లేక ఆత్మహత్య చేసుకున్నాడా? అనే విషయం తెలియలేదన్నారు. మృతుడి శరీర భాగాలు అర కిలోమీటరు దూరంలో అక్కడక్కడ లభించాయని చెప్పారు. మృతుడి వయసు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుందని తెలిపారు. నీలి రంగుల ప్యాంటు, నీలి రంగు చొక్కా, పసుపు రంగు టీషర్టు ధరించాడన్నారు. మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని, మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే 99493 04574 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వృద్ధురాలి అదృశ్యం



లక్ష్మీరాజమ్మ

గొల్లపల్లి: ఓ వృద్ధురాలు ఇంట్లో చెప్పకుండా వెళ్లి, కనిపించకుండా పోయింది. ఈ సంఘటన గొల్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని లొత్తునూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. లొత్తునూర్‌కు చెందిన తొటు లక్ష్మీరాజమ్మ ఈ నెల 6వ తేదీన చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు బంధువుల ఇళ్లలో, చుట్టుపక్కల గ్రామాల్లో గాలించారు. ఆచూకీ లభించక పోవడంతో ఆమె కుమారుడు మంగళవారం ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైస్‌మిల్లులో తనిఖీ

- 25 వేల క్వింటాళ్ల ధాన్యం దారి మళ్లినట్లు గుర్తింపు

కోరుట్లరూరల్: పట్టణంలోని ఉదయ్ రైస్ మిల్లులో మంగళవారం సివిల్ సప్లయ్ అధికారులు తనిఖీ చేశారు. ధాన్యం నిల్వలో 25 వేల క్వింటాళ్ల వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. 2022–23 సంవత్సరంలో ఈ మిల్లుకు 29,563 క్వింటాళ్ల ధాన్యం సీఎమ్మార్ కోసం కేటాయించారని పేర్కొన్నారు. తనిఖీ సందర్భంగా రైస్‌మిల్లులో కేవలం 4,500 క్వింటాళ్ల ధాన్యమే నిల్వ ఉన్నట్లు తేలిందని వివరించారు. మిగతా ధాన్యం గల్లంతైనట్లు పేర్కొన్నారు. దీంతో మిల్లు యజమానిపై 6ఏ కేసుతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేశామన్నారు. నిల్వఉన్న ధాన్యాన్ని స్వాధీనం చేసుకొని శ్రీబాలాజీ రైస్ మిల్లుకు అప్పగించినట్లు అధికారులు వివరించారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

కమాన్‌పూర్(మంథని): రామగిరి మండలంలోని బేగంపేటకు చెందిన గాదె లింగయ్య(69) ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. లింగయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. గొంతు నొప్పి వల్ల అన్నం తినలేకపోతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది, సోమవారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవిప్రసాద్ పేర్కొన్నారు.

అజ్మీరాతండా యువకుడు..

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని అజ్మీరాతండా (వట్టిమల్ల)కు చెందిన యువకుడు కరీంనగర్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల వివరాలు.. అజ్మీరాతండా (వట్టిమల్ల) గ్రామానికి చెందిన అజ్మీరా రాంరెడ్డి–జయ దంపతుల కుమారుడు భాస్కర్ స్థానికంగా ఇంటర్ వరకు చదివి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేసుకుంటూ అక్కడే ఉంటున్నాడు. అతడి సోదరి హారిక కూడా మరో ఆస్పత్రిలో పనిచేస్తూ కుటుంబంతో కలిసి ఉంటుంది. మంగళవారం మధ్యాహ్నం భాస్కర్ అద్దెకు ఉంటున్న గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. ప్రేమ వ్యవహారమే కారణమని పలువురు భావిస్తున్నారు. మృతుని తండ్రి రాంరెడ్డి గల్ఫ్‌లో ఉంటున్నాడు.



భాస్కర్ (ఫైల్)

ఎన్టీఆర్ తమిళ కాలనీలో కూలీ..

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి మండలం బావుపేట పంచాయతీ పరిధిలోని ఎన్టీఆర్ తమిళకాలనీకి చెందిన యువకూలీ ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై బి.ఎల్లయ్యగౌడ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం..ఎన్టీఆర్ తమిళకాలనీకి చెందిన రాజేశ్ (20)కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొద్ది రోజులుగా ఛాతిలో నొప్పితో బాధపడుతున్నాడు. మంగళవారం విపరీతమైన నొప్పి రావడంతో భరించలేక పేడపౌడర్ తాగాడు. స్థానికులు అంబులెన్స్‌లో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి అత్త ఒర్సు శకుంతల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చొప్పదండిలో మళ్లీ దొంగలు పడ్డారు..

- పట్టణంలోనే తిరుగుతున్న వైనం
- తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్

చొప్పదండి: చొప్పదండి పట్టణంలో మళ్లీ దొంగలు పడ్డారు. తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేస్తున్నారు. వరుస చోరీలు జరుగుతున్నా పోలీసుల్లో చలనం ఉండడం లేదని స్థానికులు అంటున్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డుసమీపం విజయానగర్‌లో నివాసం ఉంటున్న గోరంటల తిరుపతి అనే మెకానిక్ శనివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలసి హైదరాబాద్ వెళ్లాడు. ఆయన వెళ్లిన రెండు మూడు గంటల వ్యవధిలోనే ఓ దొంగ వచ్చి చోరీకి పాల్పడ్డాడు. ఇంట్లోని మూడు తులాల వెండి, విలువైన మూడు ఫోన్‌లు చోరీకి గురయ్యాయి. ప్రహరీ దూకి దొంగ దర్జాగా రోడ్డుపై నడుచుకుంటూ వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. సోమవారం రాత్రి ఇంటికొచ్చిన తిరుపతి పరిశీలించగా.. బీరువా తాళం తెరిచి ఉంది. అందులో కొంత సొమ్ము మాయమై ఉండగా.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

దొంగలు పట్టుబడటం లేదు..

పట్టణంలో వరుస చోరీలు జరుగుతున్నా దొంగలు పట్టుబడటం లేదు. తాళం వేసిన ఇళ్లను గుర్తిస్తున్న దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. శనివారం నాడు ఇంటినుంచి రాత్రి ఎనిమిది గంటలకు యజమాని తాళం వేసి బయటకు వెళ్లగా రాత్రి 11.30కు చోరీ జరుగడం గమనార్హం. పోలీసులు గస్తీ ముమ్మురం చేసినా చోరీలు జరుగుతుండగా.. తాళంవేసి బయటి ప్రాంతాలకు వెళ్లే వారు గుబులు పడుతున్నారు.



చోరీ జరిగిన ప్రదేశంలో చిందరవందర చేసిన వస్తువులు

ఉపాధిహామీ సామాజిక తనిఖీ



పనుల వివరాలు తెలుసుకుంటున్న అధికారులు



గతేడాది కూలి డబ్బులు ఇవ్వలేదంటున్న కూలీలు

- ధర్మపురి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహణ
- అవకతవకలకు పాల్పడితే చర్యలు
- అడిషనల్ డీఆర్డీఏ నరేశ్
- రూ.1.03 లక్షల రికవరీకి ఆదేశాలు

ధర్మపురి: ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనుల్లో అవకతవలకు పాల్పడితే చర్యలు తప్పవని అడిషనల్ డీఆర్డీఏ నరేశ్ హెచ్చరించారు. ధర్మపురి మండలంలో చేపట్టిన ఉపాధిహామీ పనులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. గ్రామాల వారీగా చేపట్టిన పనులు, కూలీలకు చెల్లించిన డబ్బులు తదితర అంశాలపై ఆరా తీశారు.

2,369 పనులకు 13.86 కోట్లు..

ధర్మపురి మండలంలో 2020 నుంచి 2023 వరకు 2,369 పనులకు రూ.13.86 కోట్లు వెచ్చించినట్లు రికార్డుల్లో చూపారు. ఇందులో రూ.1.03 లక్షల అవకతవకలు జరిగినట్లు తేల్చారు. ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రూ.4,990, గ్రామపంచాయతీల నుంచి రూ.19,216, కార్యదర్శుల నుంచి రూ.39,219, టెక్నికల్ అసిస్టెంట్ల నుంచి రూ.28,418, కంప్యూటర్ ఆపరేటర్ల నుంచి రూ.8,509, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ల నుంచి రూ.2 వేల రికవరీ చేసి, నెలలోపు ఆ మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించాలని ఆదేశించినట్లు అడిషనల్ డీఆర్డీవో తెలిపారు.

కూలి డబ్బులు రాలేదని కూలీల మొర

గతేడాది ఉపాధిహామీ పనులకు సంబంధించిన కూలి డబ్బులు చెల్లించలేదని కూలీలు అధికారులతో మొర పెట్టుకున్నారు. నక్కలపేట గ్రామంలో 160 మందిమి పనులు చేశామని, ఒక్కొక్కరికి 6 వారాల నుంచి 20 వారాల డబ్బులు రావాల్సి ఉందన్నారు. అధికారులను పలుమార్లు అడిగినప్పటికీ రేపుమాపు అంటూ కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు బత్తిని అరుణ, జిల్లా విజిలెన్స్ అధికారి చిన్నయ్య, అసిస్టెంట్ మేనేజర్ దేవేందర్ రెడ్డి, సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి రాజేంద్ర ప్రసాద్, జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి ప్రసాద్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతులకు వరం.. 'ఆటోమేటిక్' వాతావరణ కేంద్రం



పొలాసలోని ఆటోమేటిక్ వాతావరణ కేంద్రం

- పొలాసలో ఏర్పాటు
- వారంలో మంగళ, శుక్రవారాల్లో ప్రత్యేక బులెటిన్
- ఐదు రోజుల ముందుగానే వాతావరణ సలహాలు

జగిత్యాల అగ్రికల్చర్: భూమిని దున్నినప్పటి నుంచి పంట పండి, మార్కెట్లో విక్రయించేవరకు ఎప్పటికప్పుడు మారే వాతావరణ పరిస్థితులు రైతులకు ఒక అగ్ని పరీక్షగా మారాయి. రుతుపవనాలు రావడం ఆలస్యమవడం, పొడి వాతావరణం, బెట్ట పరిస్థితులు, వరదలు, తుపాన్లు, అకాల వర్షాలు, అకస్మాత్తుగా వడగళ్ల పడటం, వేడిగాలులు, ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు వంటివి పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతూ రైతులకు నష్టాలను మిగుల్చుతున్నాయి.

అధునాతన టెక్నాలజీ..

భారత వాతావరణ శాస్త్ర విభాగం, భారత వ్యవసాయ పరిశోధన సంస్థ, భారత శాస్త్ర, సాంకేతిక విభాగం, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో వాతావరణ విభాగం ఏర్పాటు చేశాయి. దీని ద్వారా వాతావరణ పరిస్థితులను ఐదు రోజుల ముందుగానే తెలుసుకునే వెసులుబాటు ఉంది. మరింత కచ్చితమైన సమాచారం కోసం అధునాతన టెక్నాలజీతో రూపొందించిన నాలుగైదు పరికరాలను బిగించారు. ఇందుకోసం ప్రతిరోజు ఉదయం 7.16 గంటలకు, మధ్యాహ్నం 2.16 గంటలకు వాతావరణ కేంద్రం పరిధిలోని సూర్యరశ్మి, గాలిలో తేమ, ఉష్ణోగ్రత, గాలివేగం, ఏ దిశలో గాలి వీస్తుందన్న అంశాలను సేకరించి, వాతావరణ కేంద్రం వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేస్తారు. దీనికితోడు పూర్తిగా కంప్యూటరీకరించిన కేంద్రం ద్వారా ఎప్పటికప్పుడు మరికొంత డాటా సైతం ఆటోమేటిక్‌గా భారత వాతావరణ కేంద్రానికి వెళ్తుంది. సెలవులంటూ లేకుండా 365 రోజులు ఈ కేంద్రం పని చేస్తుంది. ఇందులో వర్షం, గాలి వేగం, ఉష్ణోగ్రతలకు సంబంధించిన పరికరాలన్నీ ఒకేదాంట్లో ఇమిడి ఉంటాయి. ఇక్కడి నుంచి వెళ్లిన సమాచారాన్ని బట్టి వాతావరణాన్ని అంచనా వేసి, వెంటనే సంబంధిత వాతావరణ కేంద్రానికి పంపిస్తారు.

ముందస్తు సమాచారంతో రైతులు అప్రమత్తం

రాబోయే ఐదు రోజుల్లో వాతావరణం ఎలా ఉండబోతుందనే విషయాలు ఈ ఆటోమేటిక్ కేంద్రం వల్ల తెలుస్తాయి. పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి మంగళ, శుక్రవారాల్లో ప్రత్యేక బులెటిన్‌ను పత్రికలు, మీడియాకు, వ్యవసాయ శాఖ అధికారులకు విడుదల చేస్తారు. దీంతోపాటు అప్పటి వాతావరణాన్ని బట్టి రైతులు పంటల సాగులో ఎలాంటి చర్యలు చేపట్టాలో వివరిస్తారు. ముందస్తు వాతావరణ సమాచారం తెలియడం వల్ల అన్నదాతలు అప్రమత్తమై, పంట నష్టాన్ని, సాగు ఖర్చులను తగ్గించుకునే వెసులుబాటు ఉంటుంది.

వాట్సాప్ గ్రూపుల్లో పెట్టాలి



వాతావరణానికి సంబంధించిన ముందస్తు సమాచారం మాకు చాలా ఉపయోగపడుతుంది. వర్షం వస్తుందని తెలిస్తే ఎరువులు వేయడం ఆపేస్తాం. ధాన్యం ఆరబెడితే వెంటనే కవర్లు కప్పుకుంటున్నాం. పంటలకు సాగు నీరందివ్వడం బంద్ చేస్తాం. ఈ సమాచారాన్ని వాట్సాప్ గ్రూపుల్లో పెట్టాలి.

– కాటిపెల్లి గంగారెడ్డి, రాయికల్

వెబ్‌సైట్‌లో పొందుపరుస్తాం



వారంలో మంగళ, శుక్రవారాల్లో వాతావరణానికి సంబంధించి ప్రత్యేక బులెటిన్‌ను మీడియాకు విడుదల చేస్తాం. ప్రతిరోజు వాతావరణ కేంద్రంలోని పరిస్థితులను రెండుసార్లు సేకరించి, వాతావరణ కేంద్రం వెబ్‌సైట్లో పొందుపరుస్తాం. ముందస్తు సూచనలు ఇవ్వడం వల్ల రైతులు అప్రమత్తమవుతారు.

– డాక్టర్ నవత, వాతావరణ శాస్త్రవేత్త, పొలాస

మెరుగైన సమాచారం



పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలోని అధునాతన టెక్నాలజీతో ముందస్తు వాతావరణ సమాచారాన్ని రైతులకు అందిస్తున్నాం. కచ్చితమైన డాటా ను రికార్డు చేయడంతో వాతావరణానికి సంబంధించి మెరుగైన సమాచారం వస్తుంది. రైతులను అప్రమత్తం చేసి, సలహాలు ఇస్తున్నాం.

– డాక్టర్ శ్రీనివాస్, పరిశోధన స్థానం డైరెక్టర్, పొలాస

ఖాసీంపేటలో ఉద్రిక్తత

గన్నేరువరం(మానకొండూర్): మండలంలోని ఖాసీంపేటలో మంగళవారం ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. స్థానిక రైతువేదికలో రైతుతీర్మాన సభలో పాల్గొనేందుకు వెళ్లిన ఎమ్మెల్యే రసమయిని అడ్డుకునేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నించారు. ‘రసమయి గోబ్యాక్’ అంటూ నినాదాలు చేస్తూ వేదిక వద్దకు దూసుకొచ్చేందుకు యత్నించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, సునీల్, సంపత్‌రెడ్డి ఇతర కాంగ్రెస్ కార్యకర్తలను అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకున్నారు. కాసేపు తోపులాట జరగ్గా.. చిగురుమామిడి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ చిగురుమామిడి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వారిని విడిపించారు. గన్నేరువరంలో మాట్లాడుతూ.. అమెరికాలో అంట్లు తోముకుని బతికిన కేటీఆర్‌కు రాహుల్‌గాంధీ గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. కాగా.. గన్నేరువరంలో కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీపై కేటీఆర్ చేసిన వాఖ్యలను ఖండిస్తూ కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. పోటీగా బీఆర్ఎస్ నాయకులు కవ్వంపల్లి సత్యనారాయణ దిష్టిబొమ్మ దహనం చేశారు.



కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు